
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
మంగళవారం 19 నవంబరు 2024



20 నుంచి కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు

- ముస్తాబైన దేవాలయం
- 22న శివపార్వతుల కల్యాణం

5 లో..

పడిపోయిన ఉష్ణోగ్రతలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో కనిష్ఠంగా 12.1 డిగ్రీలు నమోదు

మెదక్ అర్బన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి చల్లని గాలులు వీస్తుండడంతో జనం వణికిపోతున్నారు. సాయంత్రం నుంచి వెచ్చని దుస్తులు ధరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ మండలంలో చూసినా 12 నుంచి 18.6 డిగ్రీలలోపే ఉష్ణోగ్రత నమోదవుతోంది.



మెదక్‌లో కురిసిన మంచు

కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- సంగారెడ్డి జిల్లాలోని అన్నాసాగర్, అల్మాయిపేట 12.1, నల్లవల్లి, కంగ్టి 12.2, సిర్గాపూర్ 12.3, కోహీర్ 12.4, పటాన్‌చెరులో 12.4, కంది 12.6, పుల్కల్ 12.7, సత్వార్ 12.8, బీహెచ్‌ఈఎల్ 12.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- సిద్దిపేట జిల్లాలోని కొండపాక 12.1, పోతారెడ్డిపేట 12.2, అంగడికిష్టాపూర్ 12.3, చిక్కోడ్ 12.5, మిరుదొడ్డి 12.6, వెంకట్‌రావుపేట 12.8 డిగ్రీలు నమోదయ్యాయి.
- మెదక్ జిల్లాలోని చిట్కుల్, ఢీధర్మారం 12.1, భుజరంపేట 12.2, శివ్వంపేట 12.5, నార్లాపూర్ 12.8, నాగాపూర్, పెద్దశంకరంపేట 12.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కార్యకర్తల పక్షపాతిని నేను..

- మీ అందరీ వల్లే నాకు ఈ పదవీ
- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కమార్ గౌడ్
- కాంగ్రెస్ కార్యక్తలు ఎదురొడ్డి పోరాడారు
- మంత్రి దామోదర రాజనర్సింహ
- స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



పీసీసీ చీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

కొండాపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : 'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పక్షపాతిగా నేను పని చేస్తా.. మీ అందరీ వల్లే నాకు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది' అని టీపీసీసీ చీఫ్ మహేష్ కమార్‌గౌడ్ అన్నారు. సోమవారం మల్కాపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మహేష్ కమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల అరాచక దొరల పాలనకు ఎదురొడ్డి పోరాడింది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనని గుర్తుచేశారు. ప్రతీ కార్యకర్త కృషితోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశాడు. వార్డు నుంచి ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ వరకు కాంగ్రెస్ నాయకులనే గెలుపించుకుంటామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సత్తా చాటుతామన్నారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు హామీలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లాలన్నారు. జిల్లా, నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి ఆదేశాల మేరకు పనిచేస్తునట్లు జగ్గారెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, కాంగ్రెస్ నేత నీలం మధు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



ర్యాలీగా వస్తున్న మంత్రి దామోదర్, పీసీసీ చీఫ్ మహేష్‌కమార్‌గౌడ్‌తో నవ్వులు చిందిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఖమ్మంపల్లి శివారులో పులి ఆనవాళ్లు

- పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు
- భయాందోళనలో ప్రజలు

కొండపాక, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామ వ్యవసాయ బావుల వద్ద సోమవారం పులి అడుగుల ఆనవాళ్లు కనపడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన పెద్ద సాయి గారి మల్లయ్య గేదె పాలు పిండుకొని వస్తుండగా తొల్ల మల్లయ్య పొలం పక్కన సొసైటీ రోడ్డుపైన పులి అడుగుల ఆనవాళ్లు కనబడ్డాయి. వాటిని చూసి భయభ్రాంతులకు గురైన ఆయన గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్రముద్దీన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మతోపాటు సిబ్బంది చేరుకుని అడుగుల ఆనవాళ్లను పరిశీలించారు. పులి కదలికలపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పొలాల దగ్గరికి వెళ్లేటప్పుడు టార్చ్‌లైట్లు దగ్గర ఉంచుకొని నలుగురు, ఐదుగురు కలిసి వెళ్లాలని, జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అవసరమైతే బోన్లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు.



పులి అడుగులను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు గ్రామస్థులు



చిన్నకోడూరులో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

పంటల బీమా ఏదీ?

ఫసల్ బీమా మార్గదర్శకాలు విడుదల చేయని సర్కారు

సన్నగిల్లుతున్న రైతుల ఆశలు..ఆరేళ్లుగా నిలిచిన పథకం

గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల ద్వారా నష్టపోయిన రైతులకు చేయూతను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఆరేళ్లుగా రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి ఏటా యాసంగి సీజన్‌లో కురుస్తున్న అకాల వర్షాలతో, వడగండ్ల వానలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పలు లోపాలు ఉన్నాయని గత ప్రభుత్వం పక్కకు పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం ఫసల్ బీమా యోజనను అమలు చేస్తామని ప్రకటించడంతో రైతులలో ఆశలు రేగాయి. కానీ ఏడాదవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు.

ప్రతీ ఏటా తప్పని నష్టం

సిద్దిపేట జిల్లాలో ప్రతి ఏటా యాసంగిలో వడగండ్ల వర్షానికి పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఐదేళ్లుగా ఫసల్ బీమా యోజన పథకం

మిగతా 6వ పేజీలో

నిలిచిపోయిన సబ్సిడీ యంత్రాలు

సిద్దిపేట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరికరాల సబ్సిడీని ఆరేళ్లుగా అమలు చేయడంలేదు. ప్రభుత్వం గతంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు పరికరాలను అందజేసేది. కేజీవీల్స్ మూడు, నాలుగు పళ్ల నాగళ్లు, రొటోవేటర్లు, స్ప్రే పంపులు అందించేది. గత ప్రభుత్వం రైతుబంధు అమలు చేయడంతో సబ్సిడీ యంత్రాల పంపిణీని నిలిపివేసింది. ప్రస్తుత ప్రభుత్వమైనా సబ్సిడీ వ్యవసాయ పరికరాలను తిరిగి ప్రవేశపెడుతుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.55వేలు వెచ్చించి వెల్డింగ్ షాపుల్లో కేజీవీల్స్, నాగళ్లు, గొర్రు ప్రత్యేకంగా చేయించుకుంటున్నారు. రొటోవేటర్లు రూ.80 వేల నుంచి రూ.1.20 లక్ష వరకు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయానికి కిరాయిలు భారం అవుతుండగా, వ్యవసాయ పరికరాలకు సైతం భారీగా పెట్టుబడులు పెడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణికి గైర్హాజరు కావొద్దు

సమయపాలన పాటించాలి : కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి జిల్లా అధికారులు గైర్హాజరు కావొద్దని, సమయపాలన పాటించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన వినతులను స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రజ్ఞాపూర్-గుండన్నపల్లిలో దాదాపు వంద సంవత్సరాలు నుంచి ఉన్న పోచమ్మ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించుకున్నాడని, ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లాలో దళిత మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సిద్దిపేటలోని టీహెచ్‌ఆర్ నగర్‌కు చెందిన దళిత మహిళపై దాడి చేసిన, మర్కుక్ మండలం ఎర్రవల్లికి చెందిన మరో మహిళ, వర్గల్ మండల్ మాదారానికి చెందిన మైసని రేణుక అనుమానాస్పద మరణాలకు కారకులైన నిందితులను అరెస్టు చేయాలని డీబీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు.



ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

కాలువ నిర్మాణానికి రైతులు సహకరించాలి

- హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి

కోహెడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు కింద కాలువ నిర్మాణ పనులకు భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వానికి సహకరించాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి కోరారు. సోమవారం కోహెడ పంచాయతీ ఆవరణలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ కింద భూమి కోల్పోతున్న రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కాలువ నిర్మాణానికి 14కిలోమీటర్ల పొడవుతో 48.16 ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. అధికారులు మంగళవారం నుంచి సర్వే చేపడతారని తెలిపారు. మార్కెట్ రేటు విలువకు మూడింతలు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ ఈఈ రమేష్ మాట్లాడుతూ కాలువ నిర్మాణంతో కోహెడ మండలానికి 12,490 ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. కోహెడ గ్రామానికి 3,300 ఎకరాలు నీరందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్, తహసీల్దార్ కె.సురేఖ, డీఈ రేష్మ, ఇన్‌చార్జి ఎంపీవో శోభ, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్, నాయకులు పాల్గొన్నారు.



రాజగోపుర ఆవరణలో భూ కైలాస్ నాటక ప్రదర్శన చేస్తున్న సురభి కళాకారులు

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

- రోడ్లపై వెళ్లేవారిపై దాడులు
- వీధుల్లో తిరగలేకపోతున్న ప్రజలు, చిన్నారులు

6



మల్లన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

అలరించిన 'సురభి' నాటకం

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకస్తోత్రపఠనంగావించారు. ముఖమండప ఆవరణలో వినాయక ఆకారంలో ప్రమిదలు అలంకరించి పూజాధికారులు చేసిన అనంతరం జ్యోతులు వెలిగించారు. కార్తీక దీపోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం రాత్రి వినాయక నాట్యమండలి (సురభి) కళాకారులు భూకైలాస్ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటక సన్నివేశాలు అలరించాయి. మల్లన్న భక్తులతో పాటు స్థానికులు హాజరై నాటకాన్ని తిలకించారు.



ఆలయంలో వినాయక ఆకారంలో ప్రమిదలను వెలిగిస్తున్న అర్చకులు





క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న పోలీస్ సిబ్బంది

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజులుగా నిర్వహించిన మూడు పేపర్లు సోమవారంతో పూర్తయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని 37 కేంద్రాల్లో రెండో రోజు మూడవ పేపర్ ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్‌కు 7,349 (54.80 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష సరళిని పరిశీలించారు. బయోమెట్రిక్ విధానం వల్ల ఇబ్బందులేమైనా తలెత్తయా అని ఆరా తీశారు. రెండు రోజులుగా విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బందిని సీపీ అనురాధ అభినందించారు.



థర్డ్ పేపర్ టఫ్ వచ్చింది

మొదటి, రెండవ పేపర్ కొంచెం ఈజీగానే ఉన్నప్పటికీ, థర్డ్ పేపర్ ఎకానమీ చాలా టఫ్‌గా వచ్చింది. 150 మార్కులకు గాను 120, నుంచి 130 వరకు కటాఫ్ ఉంటుందని అంచనా. పరీక్ష కోసం చాలామందికి సమయం సరిపోలేదు.

\- కనుగుల ఏలేష్, గ్రూప్-3 అభ్యర్థి

లెంతీ ప్రశ్నలు ఎక్కువగా అడిగారు



మూడవ పేపర్ ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్‌లో ప్రశ్నలు లెంతీగా అడిగారు. అవి చదివి అర్థం చేసుకుని సమాధానం రాసేసరికి ఎక్కువగా సమయం వృథా అయింది. ఫస్ట్, సెకండ్ పేపర్లు ఈజీగానే వచ్చియి కానీ థర్డ్ పేపర్ మాత్రం టఫ్‌గా ఇచ్చారు.

-ఎం. అనూష, గ్రూప్-3 అభ్యర్థిని



ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి

విభిన్నం ఖేడ్

- బహుభాషల వాడుకకు నిలయం
- సకల సంస్కృతీసంప్రదాయాల మిళితం
- మూడు రాష్ట్రాల పండుగలూ నిర్వహణ



5

'కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయండి'

సంగారెడ్డి రూరల్/జిన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు హోటళ్ల, రెస్టారెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. వెంటనే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, విఠల్, రాజు, కిరణ్, మహేష్ తదితరులు ఉన్నారు. అలాగే బొల్లారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మున్సిపల్ మేనేజర్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యమందించాలి

కొల్చారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యమందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. సోమవారం కొల్చారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలతో పాటు ప్రతి రూమ్‌ను పరిశీలించి మాట్లాడారు. రోగులకు అన్నివిధాలుగా మందులు సరఫరా చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, డాక్టర్ రమేష్, మెడికల్ ఆఫీసర్ హర్షిత తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న శ్రీరామ్

మొరం అక్రమ తరలింపు

● అడ్డగించిన డాకూరు గ్రామస్థులు

జోగిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అందోలు మండలంలో మట్టి, మొరం దందాలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా అందోలు శివారులోని నేషనల్ హైవే పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలోంచి పదుల సంఖ్యలో టిప్పర్లతో సోమవారం ఉదయం మొరం తరలిస్తున్నారు. డాకూరు జంక్షన్ వద్ద స్థానికులు సదరు టిప్పర్లను అడ్డగించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సాగర్ మధుకర్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల నుంచి తీసుకున్న అనుమతి మేరకే మొరాన్ని తరలిస్తున్నారని డీటీ సాగర్ మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు.


మొరాన్ని తరలిస్తున్న టిప్పర్లు

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం

వెల్దుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చర్లపల్లితండాలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. తండాకు చెందిన కేతావత్ గోపాల్ కుటుంబసభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు పని నిమిత్తం వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు పూరిగుడిసెలో విద్యుత్‌షాక్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలోని పెట్టెలో ఉన్న రూ.20 వేల నగదు, బట్టలు, వంట సామగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. అలాగే సేవాలాల్ మహరాజ్ ఆలయానికి సంబంధించి రూ.30 వేలతో తెచ్చిన సామగ్రి గోపాల్ గుడిసెలో ఉండగా.. అది కూడా పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు 11 కమిటీలు

● సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు 11 కమిటీలు ఏర్పాటు చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఈ నెల 21 నుంచి 23వ తేదీవరకు జరిగే జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 21న ఉదయం 7.30 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమౌతుందని, విద్యార్థులందరూ తమకు కేటాయించిన కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అనంతరం కమిటీలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మాజీ సైన్స్ అధికారి విజయ్‌కుమార్, నోడల్ అధికారి లింబాజీ, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, కోహీర్ ఎంఈవో జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాలికల క్రీడలు ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముత్తంగి మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల కళాశాలలో అండర్-14, 19 జిల్లాస్థాయి బాలికల క్రీడలను సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి సోమవారం ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విద్యార్థినులంతా ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. 10 కళాశాలలకు చెందిన 650 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి



బైండ్ల జశ్వంత్ మృతదేహం

పాపన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఒకరి మృతి చెందాడు. ఏఎస్సై సంగన్న కథనం ప్రకారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బైండ్ల జశ్వంత్ (19) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన స్నేహితుడు ఉమామహేశ్వర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పాపన్నపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా యూసుఫ్ పేట గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్ర గాయాల పాలైన వారిని స్థానికులు 108లో చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జశ్వంత్ మృతిచెందగా, ఉమామహేశ్వర్‌ను మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

జోగిపేట, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పాండు కథనం ప్రకారం టేక్మాల్ మండలం ధనూర గ్రామానికి చెందిన నర్సింహులు(58) కొన్ని రోజులుగా జోగిపేటలోని వాసవీనగర్‌లో నివాసముంటూ కిరాణా దుకాణాన్ని నడుపుతున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో ఆదివారం దుకాణానికి వెళ్లిన అతను రాత్రయినా ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం అన్నాసాగర్ చెరువులో నర్సింహులు మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహారాష్ట్రకు చెందిన వారీకార్ సంప్రదాయంలో భజనలు చేస్తున్న భక్తులు



కాయితా గిరిజనులు



బోగ్‌భండార్ నిర్వహిస్తున్న గిరిజనులు

విభిన్నం ఖేడ్

సంగారెడ్డి జిల్లాలోనే మారుమూల ప్రాంతంలో ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గం విభిన్న సంస్కృతులకు నిలయంగా విరాజిల్లుతున్నది. ఓ పక్కన కర్ణాటక, మరో పక్కన మహారాష్ట్ర ఉండడానికి తోడు, ఈ నియోజకవర్గంలో గ్రామాలతో సమానంగా గిరిజన తండాలు ఉండడంతో ఖేడ్ ప్రజలు విభిన్న సంస్కృతీసంప్రదాయాలను ఆచరిస్తున్నారు.

- బహుభాషల వాడుకకు నిలయం
- సకల సంస్కృతీ సంప్రదాయాల మిళితం
- మూడు రాష్ట్రాల పండుగలూ నిర్వహణ



మహారాష్ట్ర, కర్ణాటక విధానంతో టోపీ, తలపాగా ధరించిన వృద్ధులు

నారాయణఖేడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వం నిజాంపాలనలో నారాయణఖేడ్ ప్రాంతం కొంత కర్ణాటకలోని బీదర్ జిల్లాలో, మరికొంత మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉండేది. భాషాప్రాతిపదికన రాష్ట్రాల విభజన అనంతరం బీదర్, నాందేడ్ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలు నారాయణఖేడ్ నియోజకవర్గంలో చేరాయి. అయినా ఆ గ్రామాల ప్రజలు ఆయా రాష్ట్రాల సంప్రదాయాలను పాటిస్తుండడంతో ఖేడ్ విభిన్న సంస్కృతులకు నిలయంగా వర్ధిల్లుతున్నది.

వివిధ ఆచార సంప్రదాయాలు..

మహారాష్ట్రలోని ఏకాంబ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆధ్వర్యంలో వారికార్ భక్తులు నిరంతరం భజనలు, కీర్తనలు, సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సరిహద్దు గ్రామాల్లో ఇప్పటికీ మహారాష్ట్ర, కర్ణాటక సంప్రదాయాన్ని అనుసరిస్తూ టోపీలు, పాగాలు ధరిస్తారు. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా శూన్యం అమావాస్య, మహారాష్ట్రలో మాదిరిగా పొలాల అమావాస్య వేడుకలను ఇక్కడి రైతులు జరుపుకుంటారు. అంతేకాకుండా పలు పండుగలను మూడు రాష్ట్రాల సంప్రదాయాల్లో నిర్వహించుకుంటారు. ప్రతీ సంవత్సరం పండరిపూర్ క్షేత్రానికి ఆషాడ వారి ఏకాదశిని పురస్కరించుకొని వేలమందితో కాలినడకన దిండియాత్రను కొనసాగిస్తారు. దశాబ్దం క్రితం వరకు కంగ్టి మండలంలోని సరిహద్దు గ్రామాల పాఠశాలల్లో మరాఠ, నాగల్‌గిద్ద మండలంలోని సరిహద్దు గ్రామాల పాఠశాలల్లో కన్నడ బోధన ఉండేది.



కంగ్టి సమీపంలో కర్ణాటక సరిహద్దు

బహుభాషలు..

కంగ్టి ప్రాంతంవారు మరాఠ, నాగల్‌గిద్ద, మనూరు మండలాల ప్రజలు కన్నడ భాషలో అధికంగా మాట్లాడుతారు. ఈప్రాంతంలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠ భాషాలతోపాటు గిరిజనులు గోర్‌బోలి భాషలో మాట్లాడుతుండడంతో ఈ ప్రాంతం బహుభాషాలకు నిలయమని కూడా చెప్పవచ్చు.

కాయితా గిరిజనులు..

నారాయణఖేడ్‌లో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయి. సర్దార్‌తండా, బోర్గి తండా, రాజరాంతండాల్లో కాయిత గిరిజనులు నివసిస్తారు. గిరిజనుల్లోనే విభిన్న విధానం వీరిది. శాఖహారం మాత్రమే తీసుకుంటారు. ప్రతి సంవత్సరం వారి ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ దీక్షలు, దసరా సమయంలో భవానీ మాత దీక్షలు స్వీకరిస్తారు. ఆ సమయాల్లో గిరిజనులు ప్రత్యేకంగా తండాల్లో ఉన్న దేవాలయాల వద్ద ఉంటూ ప్రతీరోజు భోగ్ భండార్, భజనలు, కీర్తనలు నిర్వహిస్తారు. ఈ నియోజకవర్గంలో లింగాయత్ సామాజిక వర్గం వారు కూడా అధికంగా ఉంటారు. దీంతో ఖేడ్ ప్రాంతం విభిన్న సంస్కృతులవారు నివాసంగా పేరుగాంచింది.

నిబంధనలు పాటించని హార్వెస్టర్.. కేసు నమోదు

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ఉపయోగిస్తున్న హార్వెస్టర్‌పై ఎంవీ యాక్టుపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరించారు. తూప్రాన్ పట్టణంలో సోమవారం హార్వెస్టర్ వాహన వరి కటింగ్ బ్లేడ్‌ను వాహనానికి వెనుక ట్రాలీకి తగిలించి తీసుకెళ్లకుండా ముందు ఇంజన్‌కు బిగించి నిర్లక్ష్యంగా రోడ్డుపై తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో హార్వెస్టర్‌ను పట్టుకొని మోటారు వెహికిల్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

అల్లాదుర్గం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అల్లాదుర్గంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వార్షికోత్సవంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ప్రముఖ పురోహితులు శిలాంకోట ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాతలు బసనగారి బలరాం, బాలకిషన్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, తహసీల్దార్ మల్లయ్య, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపో మాపో..!

నేల కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం నాగాపూర్ (అంతాయపల్లి) గ్రామానికి వెళ్లే రహదారిలో హైటెన్షన్ విద్యుత్ స్తంభం నేలకొరిగేలా కిందకు వంగి ప్రమాదకరంగా మారింది. దీని సమీపంలోనే రైతులు తమ పంట పొలాల్లో వరిధాన్యం కొత కోసి ఆరబెట్టుకుంటున్నారు. అదే విధంగా నాగాపూర్ గ్రామానికి ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్తంభాన్ని సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

కోమటి చెరువును సందర్శించిన జర్మనీలు



సిద్దిపేట టౌన్, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కోమటి చెరువు వద్ద ఉన్న తెలంగాణ టూరిజం శాఖ నిర్మించిన డైనోపార్క్‌ను జర్మనీకి చెందిన పర్యాటకులు సోమవారం సందర్శించారు. హైదరాబాద్, సిద్దిపేట మరికొన్ని ప్రాంతాల్లో వారు ఈ దేశ సంస్కృతి, సంప్రదాయాలను వారు పరిశీలించారు. కోమటి చెరువు అభివృద్ధిని కొనియాడారు.

20 నుంచి కొండపోచమ్మ వార్షికోత్సవాలు

- ముస్తాబైన దేవాలయం
- 22న శివపార్వతుల కల్యాణం



కొండపోచమ్మ దేవాలయం, కొలువుదీరిన అమ్మవారు

జగదేవ్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి 23వ వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈ నెల 20న ప్రారంభమయ్యే ఈ వేడుకలు 22న శివపార్వతుల కల్యాణంతో ముగియనున్నాయి. భక్తుల కోరికలు తీర్చే తల్లిగా విరాజిల్లుతున్న ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కొండపోచమ్మతల్లి కొమురవెల్లి మల్లికార్జునస్వామికి స్వయానా చెల్లెలుగా చెబుతుంటారు. కొండపోచమ్మకు యేటా కార్తీకమాసములో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలకు హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఆలయ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో రవికుమార్ తెలిపారు. ఆలయానికి రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించామని స్పష్టం చేశారు.

రోజువారీ పూజా కార్యక్రమాలు..

ఆలయంలో మూడు రోజులపాటు విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. బుధవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండదీపస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మూత్రమంత్ర హవనము, అభిషేకము నిర్వహిస్తారు. గురువారం ప్రాతకాల పూజ, మూలమంత్ర హోమం స్థాపితా దేవతాపూజ, సామూహిక కుంకుమార్చన, మంగళహారతి వంటి కార్యక్రమాలు ఉంటాయి. శుక్రవారం శివపార్వతుల కల్యాణం ఉంటుంది.

తారును తవ్వేశారు

- ప్రైవేటు పరిశ్రమ నిర్వాకం
- పోలీస్‌స్టేషన్‌లో అధికారుల ఫిర్యాదు

రోడ్డును తవ్వి పవర్ కేబుల్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం



కోహీర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల ఓ ప్రైవేటు రసాయన పరిశ్రమకు అండర్ గ్రౌండ్ పవర్ సప్లై కోసం ఏకంగా ప్రభుత్వ నిర్మించిన తారు రోడ్డునే తవ్వేశారు. ఈ విషయమై సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో సోమవారం కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డీఈ రామచంద్రర్ తెలిపారు. 65వ జాతీయ రహదారి నుంచి ఝరాసంఘం మండలంలోని చిల్కేపల్లి గ్రామానికి వెళ్లే ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ తారు రోడ్డును స్థానికంగా ఉన్న ఓ రసాయన పరిశ్రమ వారు దర్జాగా వాడేసుకుంటున్నారు. ఈ రోడ్డును మెరుగుపరుస్తామని చెప్పి చిన్నపాటి రోడ్డు పక్కనే ఫుట్‌పాత్ నిర్మించడమే కాకుండా మరోపక్క ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. అలాగే ఈ పరిశ్రమకు వచ్చే లారీలు ఆ రోడ్డు పైనే తరుచుగా నిలిపి ఉంచడం వల్ల ఇతరుల వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే పరిశ్రమకు అండర్ గ్రౌండ్ ద్వారా పవర్ సప్లై చేయాలన్న ఉద్దేశంతో పరిశ్రమ వారు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడ ఏర్పాటు చేస్తారు... ఏ రకంగా ఏర్పాటు చేస్తారు అనే విషయాన్ని తెలుసుకోకుండానే అనుమతులివ్వడం పలు అనుమానాలకు తావిస్తున్నాయి. తవ్విన రోడ్డును పరిశ్రమవారు పునర్నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

చేగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాలబాలికల వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో ఫైనల్‌లో మెదక్, నిజామాబాద్ జట్లు తలపడగా నిజామాబాద్ విజయం సాధించింది. అలాగే బాలుర విభాగంలో ఫైనల్‌లో రంగారెడ్డిని ఓడించి ఖమ్మం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చేగుంటలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరుగడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. ఓటమి పాఠాలు నేర్చుకుని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో తహసీలార్‌నారాయణ, జిల్లా సెక్రటరీ గంగాల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లి నరేష్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, అథ్లెటిక్ జిల్లా సెక్రటరీ మధుసూదన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్ణం గణేష్ రవికుమార్, ఎంఈవో నీరజ, ఆదర్శ పాటశాల ప్రిన్సిపల్ చంద్రకళ, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, వివధ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సరిపోదా పోతారం

- నలుగురు చనిపోయినా మారరా?
- రోడ్డుపై ధాన్యంతో గాలిలో ప్రాణాలు
- ఇప్పటికీ కళ్లముందే పోతారం ఘటన
- అయినా మారని అన్నదాతల తీరు
- నియంత్రించడంతో అధికారులు విఫలం



రామాయంపేట పాత హైవేపై ఆరబోసిన ధాన్యం

రామాయంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రద్దీ రహదారులపై ధాన్యం ఆరబోతతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అన్నదాతల్లో మార్పు రావడం లేదు. ఇటీవల పోతారంలో రోడ్డుపై ధాన్యం వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందినా చలనం లేకపోవడమేమిటని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం హైవేపైనే కూలీలు సీతాఫలాలు అమ్ముతుండగా.. ఓ వ్యక్తి కారు నిలిపి కొనుగోలు చేసే క్రమంలో.. వెనుక నుంచి వచ్చిన బైక్ కారును ఢీ కొట్టటమే గాక మరో రెండు బైకులకు తగిలి ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. అంతేకాదు గతేడాది ధర్మారం శివారులో రోడ్డుపై ఉన్న వరి కుప్పలను ఓ ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణలు వదిలాడు. రెండేళ్ల క్రితం పులిమామిడి సమీపంలో మరొకరు ప్రమాదానికి గురై చనిపోయాడు. మరెందరో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిపాలయ్యాడు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా జరుగుతున్నా రైతులు రహదారులపై ధాన్యం ఆరబోయడం మాత్రం ఆపడంలేదు. రామాయంపేట-సిద్దిపేట మెయిన్ రోడ్డుపై ధాన్యం ఆరబోతతో ఒకే రూట్‌లో పెద్ద పెద్ద వాహనాలు ప్రయాణించడం.. ఇంకో పక్క రోడ్డును అనుకొని మల్లెచెరువు ఉండటంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం సాగించాల్సి వస్తోందని పలువురు వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. దీన్ని నియంత్రించడంలో అధికారణం విఫలమవుతున్నది.

కలెక్టర్ ఆదేశించినా..

తరచూ ప్రమాదాల నేపథ్యంలో రెండున్నర నెలల క్రితం స్వయంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ స్థానిక బైపాస్ జంక్షన్‌లో నివారణ చర్యలపై పోలీసులతో చర్చించారు. రోడ్లపై ధాన్యం ఆరబోతను అడ్డుకోవాలని ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. పోతారంలాంటి ఘటనలు మరిన్ని చోటు చేసుకోక ముందే అధికారులు స్పందించి రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



రహదారులే.. కల్లాలుగా..

నర్సాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్లపై రైతులు అవగాహన లోపంతో ధాన్యం ఆరబెడుతుండటంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు వెల్లే రోడ్లపై పెద్ద ఎత్తున ధాన్యం ఆరబోత చేపడుతున్నారు. రైతులకు కల్లాలు అందుబాటులో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రోడ్లనే కల్లాలుగా వినియోగించడం ప్రయాణికులకు శాపంగా మారుతున్నది. రాత్రిపూట రోడ్లపై ధాన్యం కనిపించక బైకులు అదుపుతప్పి పలువురు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతోప్రతీ గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ఉచిత పశు వైద్య శిబిరం



మనోహరాబాద్, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి రైతులు తమ పశువులు తీసుకువచ్చి వైద్యులకు చూపించారు. పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులను గుర్తించి చికిత్స చేశారు. గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, పశువైద్యాధికారి సత్యనారయణ, గోపాలమిత్ర, పర్యవేక్షకుడు కృష్ణ కుమార్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక/బెజ్జంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సత్యం తెలిపారు. బందారం, అంకిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఉదయం పది నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే బెజ్జంకి మండలం బేగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ పరిధిలోని రేగులపల్లి, కల్లేపల్లి, బేగంపేట, వడ్లూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని బెజ్జంకి ఏడీఈ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో కోరారు.

విశ్వకర్మ పరిషత్ మండల అధ్యక్షుడిగా వెంకటరాజ్‌చారి

దుబ్బాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ మండల కార్యవర్గాన్ని సంఘం రాష్ట్ర నాయకులు శ్రీరాములు, వేణుగోపాల్‌చారి, జిల్లా అధ్యక్షుడు బాసంపల్లి నర్సింహాచారి, ఉపాధ్యక్షుడు బెజ్జంకి నాగభూషణంచారిని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటరాజ్‌చారి, ఉపాధ్యక్షుడిగా నాగరాజ్‌చారి, ప్రధాన కార్యదర్శిగా రాజేశంచారి, కోశాధికారిగా శ్రీనివాస్‌చారితోపాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నాకర్, ప్రవీణ్‌కుమార్, పుల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మండలాధ్యక్షుడిగా రమేష్

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య మహాసభ చేర్యాల రూరల్ మండలాధ్యక్షుడిగా మండలంలోని కడవేరుగు గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి నియామకపత్రం అందజేశారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం


దగ్ధమవుతున్న పూరిగుడిసె

తొగుట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. తొగుట మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బచ్చల కనకవ్వ, రాములు కూలీ పనులు చేసుకుంటూ పూరిగుడిసెలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా పూరిగుడిసె పైనుంచి వెళ్లిన విద్యుత్ వైర్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో నిప్పంటుకుని పూరిగుడిసె దగ్ధమైంది. ఇంట్లో నిద్రిస్తున్న దంపతులు వెంటనే బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. గుడిసెలో ఉన్న తులం బంగారం, 30 తులాల వెండితోపాటు రూ.30 వేల నగదు, బట్టలు, బియ్యం దగ్ధమయ్యాయి. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 33 మందికి జరిమానా

గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మందికి రూ.25 వేల జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. గజ్వేల్‌లోని ఆయా చౌరస్తాల్లో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 33 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గజ్వేల్ కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసి రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని మురళీ తెలిపారు.

సిద్దిపేటలో 14 మందికి..

సిద్దిపేట క్రైం: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కొన్నిరోజుల క్రితం నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 14 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా.. విచారణ చేసి 14 మందికి రూ.22,500 జరిమానా విధించారు.


ఇర్కోడులో రోడ్డుపై స్వైరవిహారం చేస్తున్న కుక్కల గుంపు

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

- రోడ్లపై వెళ్లేవారిపై దాడులు
- వీధుల్లో తిరగలేకపోతున్న ప్రజలు, చిన్నారులు

సిద్దిపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగులై స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరిపై దాడి చేస్తున్నాయి. అంతేకాకుండా గొర్రెల, మేకల మందపై కూడా దాడి చేస్తుండడంతో మూగజీవాలూ మృత్యువాతపడుతున్నాయి. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నెలకు 20 కేసులు కుక్కల దాడిలో గాయపడిన బాధితులు వస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం జక్కాపూర్‌లో చిన్న పిల్లాడిపై దాడిచేసి గాయపర్చాయి. అలాగే గ్రామ శివారులో ఉన్న గొర్రెల, మేకల మందపై దాడిచేసి దొరికిన గొర్రెలను తీవ్రంగా గాయపరిచి చంపేశాయి. కుక్కల మూలంగా ఇటు ప్రజలు, అటు గొర్రెల, మేకల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రోడ్ల పక్కనే కోళ్ల వ్యర్థాలు

పలు గ్రామాల్లో చికెన్ సెంటర్ల నిర్వాహకులు చికెన్ అమ్మకాల్లో మిగిలిన వ్యర్థాలను గ్రామ శివారులోని రోడ్ల పక్కనే పడేస్తున్నారు. దీంతో ఎక్కడెక్కడో ఉండే కుక్కలు ఒకచోట చేరి వ్యర్థాలను తినేందుకు అలవాటుపడ్డాయి. ఈ క్రమంలో అటువైపు వెళ్లే వారిపై కాపుకాచి మరీ దాడిచేస్తున్నాయని పలువురు చెబుతున్నారు.

కనిపించని నియంత్రణ మార్గదర్శకాలు

పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని ప్రజలు గ్రామసభల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి కానీ, అధికారులు నుంచి కానీ స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్న పిల్లలు బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంది. ఎటుచూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారిని వెనక నుంచి దాడిచేస్తుండడంతో కొందరు వాకింగ్‌కు వెళ్లడమే మానేస్తున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడేందుకు నియంత్రణ చర్యలు చేపట్టాలి.

- మహిపాల్‌రెడ్డి, పుల్లూరు

నివేదికలు పంపించాం

గ్రామపంచాయతీల నుంచి కుక్కల సంఖ్యను తెప్పించి పశు సంవర్ధకశాఖకు నివేదికలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే కుక్కలకు నియంత్రణ చర్యలు చేపడుతాం. ఆయా గ్రామాల ప్రజలు కుక్కలతో జాగ్రత్తలు పాటించాలి. చికెన్ సెంటర్ నిర్వాహకులు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేస్తే చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్‌రావు, మండల పంచాయతీ అధికారి సిద్దిపేటరూరల్/నారాయణరావుపేట


జక్కాపూర్‌లో కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు, మేకలు(ఫైల్)

'ఉపాధిహామీ'లో హుస్నాబాద్ రోల్‌మోడల్‌గా నిలవాలి

- అడిషనల్ డీఆర్డీవో బాలకిషన్


సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో బాలకిషన్

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో సిద్దిపేట జిల్లాకు హుస్నాబాద్ మండలం రోల్‌మోడల్‌గా నిలవాలని, అందు కోసం మండలంలోని ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న టీఏలు, ఎఫ్‌టీలు సమర్థవంతంగా పనిచేయాలని అడిషనల్ డీఆర్డీవో బాలకిషన్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ మండల పరిషత్ ఆవరణంలో ఉపాధిహామీ పనులపై 14 విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 437 పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ జరిగిందన్నారు. ఉపాధిహామీ అభివృద్ధి పనుల్లో సామాజిక తనిఖీ అంశం ఒక భాగమన్నారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, చేసిన ఖర్చు పనుల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించిన పనులు చేపట్టినప్పుడు రైతుల వివరాలు, చేసిన పనుల, కూలీల సంఖ్య ఖర్చు వివరాల సూచిక బోర్డులు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. వర్క్‌బుక్, మాస్టర్ ఈ పథకానికి ప్రధానమైనవని, కనీసం వాటి నిర్వహణ సరిగా చేయకపోవడం వల్ల సామాజిక తనిఖీల్లో చిన్నచిన్న పొరపాట్లు వెలుగు చూస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే సామాజిక తనిఖీ వరకు హుస్నాబాద్ మండలంలో చిన్న పొరపాటుకు తావులేకుండా ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్ ఈసీలు, ఏపీవోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, అవాంఛ్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఏపీవో పద్మ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

చేతిరాతనే మన తలరాత: అజీజ్‌అహ్మద్


మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్‌రాములు

మర్కుక్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మన చేతిరాతనే మన తలరాతని, చేతిరాత అందంగా ఉంటేనే తలరాత అందంగా తీర్చిదిద్దబడుతుందని ప్రముఖ చేతిరాత నిపుణుడు అజీజ్‌అహ్మద్ అన్నారు. సోమవారం మర్కుక్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంటలో ఒకరోజు వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మూడు భాషల్లో(తెలుగు, హిందీ, ఇంగ్లిష్) చేతిరాత నైపుణ్యాలను బోర్డుపై రాసి చూపించారు. అనంతరం విద్యార్థులకు అసైన్‌మెంట్ ఇచ్చి మరీ తర్ఫీదునిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకట్‌రాములు మాట్లాడుతూ ఎన్నో పనులు ఉన్నా.. విద్యార్థులకు ఉపయోగపడే చేతిరాతపైన ఒకరోజు సమయం కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటనరసింహారెడ్డి, సుభాష్‌చందర్, చిన్నబ్రహ్మయ్య, రాజిరెడ్డి, జయశ్రీ, పుష్పలత, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు

- సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి


చేర్యాల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మల్లారెడ్డి తదితరులు

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పాతబస్టాండ్ నుంచి అంగడిబజారు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహావరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి జనగామ ఎన్నికల ప్రచారసభలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. గతంలో దీక్ష చేపట్టిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్తశుద్ధి కనబరచకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే జేఏసీని రద్దుచేసి తమ అధిష్టానం వద్ద చేర్యాల ఆకాంక్షను వెలిబుచ్చి రెవెన్యూ డివిజన్ సాకారం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి నాగరాజు, నాగపురి కనకయ్య, మోకు ఇంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా పోరాట ఫలితమే హక్కులు

ధూళిమిట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాటి నుంచి నేటివరకూ ఎర్రజెండా పోరాట ఫలితంగానే ప్రజలకు హక్కులు సిద్ధించాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం సీపీఎం ధూళిమిట్ట రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి జెండావిష్కరణ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, చొప్పరి రవికుమార్, బండకింది అరుణ్‌కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి


జడ్పీ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సింహులు

దౌల్తాబాద్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సింహులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముబ్బరాస్‌పూర్ జడ్పీ పాఠశాలను, మొండి చింత వద్ద ఎంజేపీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి అపార్ కార్డు ఇస్తుందన్నారు. అపార్ కార్డు జనరేట్ చేసేందుకు విద్యార్థుల సమాచారం తప్పులు లేకుండా పొందుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గజ్జల కనకరాజు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రకాశం, అబ్దుల్ హుస్సేన్, బాసిత్ దుర్గాప్రసాద్, సీఆర్పీలు రాజు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం స్వాధీనం

- కేసు నమోదు


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్దూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వల్లంపట్లలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన గౌరిశెట్టి విశ్వనాథం రేషన్ బియ్యాన్ని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. వెంటనే తనిఖీ చేసి 7.71 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు సమాచారమందించి, వారికి అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు గౌరిశెట్టి విశ్వనాథంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భరత్


పోటీలకు ఎంపికైన భరత్

రాయపోల్/గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రాయపోల్ క్రీడాకారుడు గుంటుకు భరత్ ఎంపికైనట్లు పీడీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి అండర్-19 బాలుర వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈనెల చివరి వారంలో నారాయణపేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సర్వే చేస్తున్న ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయొద్దు


దుద్దెడలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

కొండపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను కిందిస్థాయి అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజయేందర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు రామస్వామి పేర్కొన్నారు. సోమవారం సమస్యల సేకరణ, సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా కొండపాక మండలంలోని దుద్దెడ, బందారం, అంకిరెడ్డిపల్లి, మర్పడగ, ఖమ్మంపల్లి, సిరిసినగండ్ల, కొండపాక బాలికల, బాలుర ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీ, తిమ్మారెడ్డిపల్లి ఉన్నత, ప్రాథమిక తదితర పాఠశాలలను సందర్శించి దుద్దెడలో మాట్లాడారు. ఎన్యూమరేటర్లను రోజువారీ టార్గెట్ పూర్తిచేయకపోతే షోకాస్ నోటీసులు జారీచేస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు దాదాపు 150 కుటుంబాలకు పైగా కేటాయించడం వల్ల అనుకున్న సమయంలో పూర్తికావడం లేదని, మరో పది రోజులు పొడిగించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సత్య కృష్ణ, రాములు, కొండపాక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, కనకయ్య కుకునూరుపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రం అంజయ్య, శంకర్, యాదయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

దుబ్బాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జీ.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, ఆకారం, గోసాన్‌పల్లి, గంబీర్‌పూర్, పెద్దచీకోడు గ్రామాలలను సందర్శించి, పాఠశాలల సమస్యలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, జానకీరాములు, రవీందర్‌రెడ్డి, వెంకట్, పెంటయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పంటల బీమా ఏదీ?

మూడోపేజీ తరువాయి

అమల్లో లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యారు. నాలుగేళ్లుగా జిల్లాలోని చిన్నకోడూరు, వర్గల్, నంగునూరు, కొహెడ, హుస్నాబాద్, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి, జగదేవ్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో పంటలకు వడగండ్లతో తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పులు తీసుకువచ్చి ఆయా పంటలను సాగు చేసిన రైతులకు వడగండ్లతో నష్టం తప్పలేదు. ఈ క్రమంలో ఫసల్‌బీమా యోజన పథకం అమల్లో ఉంటే రైతులకు ఎంతో కొంత ఊరట దక్కేదని రైతులు భావించారు. గతేడాది బేషజాలు లేకుండా ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా, ఇప్పటివరకు పథకానికి సంబంధించి మార్గదర్శకాలు వెలువడలేదు. యాసంగి సీజన్ ముంచుకు వస్తున్నా పట్టించుకోవడం లేదు. గతంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, రైతులు 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై భారం పడకుండా ప్రభుత్వమే 100 శాతం ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కానీ నేటికి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంటల సాగు

సిద్దిపేట జిల్లాలో నాలుగున్నర లక్షల ఎకరాలలో ఆయా పంటలను రైతులు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. వరి పంట మూడు లక్షల 40వేల ఎకరాల్లో సాగుచేయనున్నారని, ఇతర పంటలు మరో లక్షా 10వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా వేశారు. జిల్లాలో భారీ సాగునీటి జలాశయాలు అందుబాటులోకి రావడంతో నాలుగేళ్లుగా యాసంగిలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది భారీగా వరి పంట సాగయ్యే అవకాశాలే కనిపిస్తున్నాయి.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ప్రయోజనం

- కొమురవెల్లి వ్యవసాయాధికారి వెంకటరమణ


తపాస్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారి వెంకటరమణ

చేర్యాల, నవంబరు 18 : ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ శ్రమ, ఖర్చుతోపాటు అధిక ప్రయోజనం పొందవచ్చని కొమురవెల్లి మండల వ్యవసాయాధికారి వెంకటరమణ అన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్, తపాస్‌పల్లి గ్రామాల్లో పర్యటించి రైతులకు ఆయిల్‌పామ్ సాగుతోపాటు వరికొయ్యల దహనం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగు చేపట్టాలని సూచించారు. వరిపంట చే తికందిన క్రమంలో కొయ్యలను భూమిలో కలియదున్నాలని, దహనం చేస్తే భూసారం దెబ్బతింటుందన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సోషల్ మీడియా మోజులో పడకుండా పుస్తకాల చదవటం అలవాటు చేసుకుని, అక్షర జిజ్ఞాసను పెంపొందించుకోవాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లైబ్రేరియన్స్ దాసరి రాజు, కే.రాజు, గ్రంథాలయ సిబ్బంది ముజాఫర్, సాయి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్, పైపులైన్ పనులకు భూమిపూజ

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టులో తమ భూములు కోల్పోయిన నిర్వాసితులు కూచనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసుకున్న పునరావాస కాలనీలో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణం కోసం రూ.36 లక్షల నిధులు మంజూరు చేశారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహీనా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బంక చందు ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మామిడి రాజు, మడప యాదవరెడ్డి, నీరటి సాయిలు, మడప పెద్దిరెడ్డి, చేప్యాల శ్రీను, ఇంద్రాల స్వామి, పంచాయతీ కార్యదర్శి రజిత, కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మధుకు రాష్ట్రస్థాయి అవార్డు

మర్కుక్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల శివారువెంకటాపూర్ ఉపాధ్యాయుడు మధు రాష్ట్రస్థాయి టీచర్స్ ఇన్స్పిరేషన్ అవార్డ్-2024 అందుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా బీఎంబిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కరా ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో చైర్మన్ పట్నం కమల మనోహర్, శాతవాహన యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఉమేష్‌కుమార్, రోబోటిక్ సీఈవో మనీష్‌జిందాల్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డా.సాహిత్యవల్లి, నక్క శ్రీనివాస్, పట్నం సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేబల్లి శ్రీనివాసరావు, తుమ్మ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

నాచగిరి క్షేత్రం ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

వర్గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరొందిన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ధర్మకర్తల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసినట్లు క్షేత్రం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆలయ పాలక మండలి నియామకానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు నోటిఫికేషన్ తేదీ నుంచి 20 రోజుల్లోపు హైదరాబాద్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం, సంగారెడ్డి సహాయ కమిషనర్ కార్యాలయం, నాచారంగుట్ట ఆలయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెరువులోంచి పంట కాలువను వ్యతిరేకించా..

- కమ్మర్‌పల్లి మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి

దుబ్బాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి పటేల్‌చెరువులో నుంచి పంట కాలువను తీయడం తానే ముందు వ్యతిరేకించానని, శిఖం భూమికి పరిహారం ప్రభుత్వం ఇస్తే ఎందుకు అడ్డుకుంటానని దుబ్బాక మండలం కమ్మర్‌పల్లి మాజీ ఎంపీటీసీ ఎల్.రాంరెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన మహిళా రైతు ఆత్మహత్యాయత్నం కలిచివేసిందని, తనపై ఆరోపణలు కూడా సముచితం కాదన్నారు. గ్రామంలోకి సాగునీరు రావాలనే తాపత్రయం తప్పా మరేమీ లేదన్నారు. మల్లన్నసాగర్ ద్వారా 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా 7, 8 గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. అయితే ఆ కాలువ సర్వే రూట్‌ను మార్చాలని తాను కోరినట్లు తెలిపారు. మహిళా రైతు మల్లవ్వ ఆత్మహత్యాయత్నానికి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. గ్రామంలోని ప్రతీఒక్కరికి మేలు జరగాలని కోరుతానని, చిల్లర రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

సామాజిక, ఆర్థిక సర్వే పరిశీలన

గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేను మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సందర్శించారు. ప్రజ్ఞాపూర్‌లోని ఆయా వార్డుల్లో సర్వేను పరిశీలించిన అనంతరం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లతో మాట్లాడి సర్వేలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ ప్రజలు సహకరించాలని కోరారు.